క్లుప్తంగా

చీరలు, స్టూల్స్ పంపిణీ



నందిగామ టౌన్:వాసవీ సిల్వర్ స్టార్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పులిపాటి సంధ్యారాణి, జోన్ వాసవియన్ సభ్యుడు పులిపాటి వెంకటేశ్వరరావు సౌజన్యంతో గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరిమేశ్వరీ అమ్మవారి ఆలయానికి 60 స్టూల్స్, చిరు వ్యాపారులకు స్టాండింగ్ గొడుగులు, పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు తమ వంతుగా సహాయ సహకారం అందించామని భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే తలంపుతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవీ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మహంకాళి నరసింహారావు, జిల్లా ఇన్‌చార్జ్ పరిశీలకుడు గోపు రాము, సముద్రాల ఈశ్వరయ్య, కొత్త నాగప్రభాకరరావు, నకిరికంటి వెంకటేశ్వరరావు, దొడ్డు నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు ఇతర ఎరువులను లింకు పెడితే చర్యలు



పెనుగంచిప్రోలు:ఇతర ఎరువులు కొంటేనే యూరియా కట్టలు ఇస్తామని లింకు పెడితే చర్యలు తప్పవని ఎరువుల దుకాణాల డీలర్లను అధికారులు హెచ్చరించారు. గురువారం గ్రామంలోని ఎరువుల దుకాణాలను ఏఓ రామసుబ్బారెడ్డి, డీటీ నాగుల్‌మీరా, ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ తనిఖీలు చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు, యూరియా నిల్వలు, ఈ–పాస్ మిషన్లు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు ఏవైనా ఈ–పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఇవ్వాలన్నారు. అన్ని దుకాణాల ముందు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసే ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలు పెట్టాలన్నారు. రైతుల ఆధార్ కార్డు, పాస్‌బుక్ జిరాక్స్‌లను చూసి యూరియా కట్టలు అందజేయాలన్నారు. ఎరువుల నిల్వలు, ధరల పట్టిక బోర్డుపై సూచించాలన్నారు. రైతులు రెండవసారి యూరియా బదులు నానో యూరియా స్ప్రే చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ హలీమ్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలి



పెనుగంచిప్రోలు:సెప్టెంబర్ 5, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించాలని కోరుతూ గురువారం స్థానిక మండల వనరుల కేంద్రంలో సిబ్బందికి యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. గత ఏడాది అన్ని ఉపాధ్యాయుల యూనియన్ల సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరిగింది. అయితే వరదల కారణంగా జరపలేదు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్న కారణంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక చేపట్టి సన్మాన కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు పి లీల, జిల్లా కార్యదర్శి షేక్ ప్రైమర్, మండల అధ్యక్షులు పాము నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు చాగర్ల రామారావు, నాయకులు భారతి, ఎస్.సుబ్రహ్మణ్యస్వామి, దైద దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి..



నందిగామ రూరల్:రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డిపై గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నా ప్రభుత్వాలు కనీసం స్పందించటం లేదన్నారు. అనంతపురం జిల్లా గుత్తి, పామిడి మండలాల పరిధిలోని ఐదు గ్రామాల్లో సోలార్ విండ్ పవర్ ప్రాజెక్టును రెన్యు విక్రమ్ అనే సంస్థకు ఇచ్చే విధంగా ప్రభుత్వం భూసేకరణ చేసిందన్నారు. దానిని పరిశీలించేందుకు వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులపై ఎమ్మెల్యే జయరాం అధికార మదంతో అసభ్య పదజాలంతో దూషించటం, బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. నాయకులు కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు, కళ్యాణ్, శ్రీనివాసరావు, ఏడుకొండలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

వత్సవాయి: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని గురువారం వత్సవాయి జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలకు సెలవు కావడంతో గురువారమే నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్ఎం ఎస్ అనితశ్రీ మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, బహుముఖ ప్రజ్ఞాశాలి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు. రాధాకృష్ణ జీవితచరిత్రను నేటితరం విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణగావించి పాఠాలను బోధించారు. పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఉపాధ్యాయురాలు వి.పద్మావతిని ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాకాని శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ అద్దంకి సుధాకర్, పీడీ మార్కపూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కృషి మరువలేనిది...

నందిగామరూరల్:మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చందాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయుడు రాజశేఖర్ మాట్లాడుతూ జ్ఞానాన్ని అందించటం, విద్యార్థులను బాధ్యతాయుతమైన భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటంలో ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు.



ఆటలు ఆడుతున్న ఉపాధ్యాయులు



చందర్లపాడులో సత్కార మెమొంటోలతో ఉపాధ్యాయులు

అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. చందర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రదానోపాధ్యాయురాలు శ్రీలత, విశ్రాంత ప్రదానోపాధ్యాయుడు మద్దినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు నైతిక విలువలు పాటించాలి...

పెనుగంచిప్రోలు:విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలు పాటిస్తూ జీవితంలో పైకి రావాలని విద్యాదాత స్వామి గోపాలరావు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించకుని గురువారం స్థానిక ఎస్ఎస్‌పీఎం బాలికల హైస్కూల్లో వేడుకలు నిర్వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం నక్కా బాబూరావు మాట్లాడుతూ పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతల సహకారం మరువలేనిదన్నారు.

కంచికచర్ల: ఓసీ క్లబ్‌లో ఉపాధ్యాయుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్ది వారి ఉజ్వల భవిష్యత్‌కు మార్గదర్శకులుగా ఉండేది ఉపాధ్యాయులేనని చెప్పారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోగంటి బాబు, ఎంఈఓ–2 బీ బాలాజీనాయక్, పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో....

గండ్రాయి(జగ్గయ్యపేట):గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు నేలవెల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు సుబ్బారావు, దైవాదీనం, పద్మావతమ్మ, ముక్తేశ్వరరావు, రాజ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు. కెఅగ్రహారం గ్రామ మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు...

జగ్గయ్యపేట అర్బన్:ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, సిబ్బందికి పలు అంశాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులకు మ్యూజికల్ చైర్, త్రోబాల్, లెమన్‌స్పూన్, తాడు లాగటం పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పలువురు వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. ఉమేష్‌బాబు, ఉపాధ్యాయులు పి.మాధవి, ఎస్.రమ, రవికుమార్, మురళీకృష్ణ, కృష్ణ, భాగ్యకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలు పద్మావతిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు



చందాపురం జెడ్పీ స్కూల్లో సర్వేపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కంచికచర్లలో ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే సౌమ్య



గండ్రాయిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆందోళన



జగ్గయ్యపేట అర్బన్:కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతున్నప్పటికీ నేటికీ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం దుర్మార్గం అని ఎస్ఎఫ్ఐ పేట మండల కార్యదర్శి ఎస్.ప్రణయ్‌తేజ అన్నారు. గత కొంత కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం వలన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. దీని వలన అనేక మంది విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జగ్గయ్యపేట మండల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 ను రద్దుచేయాలని, ఇతర విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం డిగ్రీ విద్యార్థులతో పట్టణంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. రైతుబజారు వద్ద అంబేడ్కర్ కూడలి నుంచి బయలుదేరిన ర్యాలీ ప్రధాన వీధుల గుండా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొంది. తహసీల్దార్ మనోహర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ప్రణయ్‌తేజ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఈ రోజు హామీలను నిలబెట్టుకోవడంలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ వంద రోజుల్లో జీవో నెంబర్ 77 ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు పూర్తిఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారని, నేటి వరకు హామీలు అమలుచేయకపోవడం దారుణం అన్నారు. అలాగే ఈనెల 6 వ తేదీన ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో విద్యార్థులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రిహాన్, రెహమత్, వంశీ, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



మంగొల్లులో పూజలందుకుంటున్న గణనాథుడు



గణనాథుడికి పూజలు చేస్తున్న కళాశాల సీఈఓ సాయిమనోజ్, ప్రిన్సిపాల్ శశిధర్



స్వామి వారి లడ్డూని మోస్తున్న దృశ్యం

వత్సవాయి: వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి క్రతువులు చేశారు. తొమ్మిదవ రోజు పూజలు అనంతరం శుక్రవారం నిమజ్జనానికి తరలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనాలకు జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల, వేదాద్రి గ్రామాలకు తరలించనున్నారు. నిమజ్జనం సందర్భంగా ముఖ్య కూడళ్లలో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు తెలిపారు.

అమితసాయిలో వినాయకునికి విశేష పూజలు

కంచికచర్ల: పరిటాల అమితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో వినాయకుడికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ, సీఈఓ కే సాయి మనోజ్ మాట్లాడుతూ ఏటా కళాశాలలో వినాయక చవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆ గణనాథుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని, విద్యార్థులకు విజయం కలగాలని కోరారు. అనంతరం బీటెక్ సీఐసీ (సైబర్ సెక్యూరిటీ) విభాగం వారు స్వామి వారి లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడి ఉత్సవ విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఇబ్రహీంపట్నం ఫెర్రి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ రూరల్:వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక మంటపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. పట్టణంలోని ముక్కోటి మహా మండపం, వాసవీ మార్కెట్, గాంధీ సెంటర్‌లలో ఏర్పాటు చేసిన గణనాథులకు గురువారం విశేష పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. ముక్కోటి మహా మండపంలో ఏర్పాటు చేసిన 15 అడుగుల మట్టి గణపయ్యకు 1001 చెరుకు గడలతో సహస్ర నామ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలోని యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ సమీపంలోని కృష్ణానది వద్ద గురువారం నిమజ్జనాలు కోలాహలంగా జరిగాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ప్రత్యేక వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాలలో కృష్ణానది వద్దకు తీసుకొచ్చారు. నది వద్ద ప్రత్యేక పూజలనంతరం గంగమ్మ వడికి గణనాథులను చేర్చారు. దాదాపు 50కి పైగా విగ్రహాల నిమజ్జనం అర్ధరాత్రి వరకు కొనసాగింది. నిమజ్జన ఏర్పాట్లను సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, ట్రైనీ ఎస్ఐ మణికంఠలు బందోబస్తు నిర్వహించారు.

పెనుగంచిప్రోలు:గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు మండపాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ఊరేగింపు అనంతరం నిమజ్జనాలకు తరలి వెళ్లాయి. కాజ్‌వే పక్కన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు.

జగ్గయ్యపేట అర్బన్:వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం తొమ్మిదవ రోజున పలు వార్డుల్లోని మండపాల్లో కొలువైన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక 23 వ వార్డులో టీం ఎంజీబీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కమటాల మహేష్, కనిగిరి భాను, సతీష్, సంగెపు కార్తీక్, కనిగిరి సుబ్బారావు, గద్దం చంద్రశేఖర్, కత్తి గోపి, మున్నా, నాగేంద్ర పాల్గొని పర్యవేక్షించారు.



చెరుకు గడల సహస్ర నామ పూజల్లో నందిగామ ముక్కోటి మండపంలోని గణనాథుడు



వేదాద్రి వద్ద పోలీసుల బందోబస్తు



నిమజ్జనానికి గణనాథుడిని తరలిస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలులో గణనాథుని ఊరేగింపు



గణపతి నవరాత్రుల పందిరి వ్రతంలో పాల్గొన్న భక్తులు



జగ్గయ్యపేటలోని నాయీబ్రాహ్మణ కాలనీలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం

ఘనంగా ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

నందిగామ టౌన్:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషుల నడుమ శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ జన్మదిన వేడుకలను జరుపుకోవటం సంతోషంగా ఉందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ అరుణకుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అరుణకుమార్ జన్మదిన కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, పట్టణ మండల కన్వీనర్‌లు మహ్మద్ మస్తాన్, మంచాల చంద్రశేఖర్, కంచికచర్ల ఎంపీపీ మలక్ బషీర్, వైస్ ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు కన్నెకంటి జీవరత్నం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, చింతా రవీంద్రనాద్, వైఎస్ఎన్ ప్రసాద్, దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, గరికపాటి భాస్కరం, షేక్ యాకుబ్ అలీ, షేక్ జాఫర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల:నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు జరుపుకోవటం ఆనందంగా ఉందని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు స్థానిక ఇందిరాకాలనీ వాసులు గురువారం జరుపుకున్నారు. కార్యక్రమం వేముల గోపీ, సురేష్‌రాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని వారితో పాటు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.



పార్టీ నాయకులతో కలసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

యూరియా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే కేసులు

కంచికచర్ల:యూరియాను నిల్వ చేసి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి కె.వి జయకుమార్ హెచ్చరించారు. ప్రైవేటు డీలర్ ఎరువుల దుకాణాలను గురువారం రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ముందుగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఏఓ మాట్లాడుతూ కంచికచర్ల మండలంలో యూరియా అందుబాటులో ఉందని రైతులు అవసరమైన యూరియా ఎరువును కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు. మండలంలో ప్రైవేటు డీలర్ల వద్ద 108.15 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. గ్రోమోర్ డీలర్ వద్ద 17.95 టన్నులు, కనకదుర్గా ఫెర్టిలైజర్స్ 14.085, నందిసీడ్స్‌లో 9 టన్నులు, భార్గవి ఎంటర్‌ప్రైజెస్‌లో 0.09 మెట్రిక్ టన్నులు, శ్రీ వెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ 2.3 మెట్రిక్ టన్నులు, హిమ బిందు ఫెర్టిలైజర్స్ 4.6 టన్నులు, మోగులూరు మౌనిక ఫెర్టిలైజర్స్‌లో 22 టన్నులు, మున్నలూరులోని శ్రీ ప్రసన్న ఫెర్టిలైజర్స్ 10 టన్నులు, పెండ్యాలలోని షణ్ముఖ ఫెర్టిలైజర్స్ 10 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కంచికచర్లలో యూరియా నిల్వల స్టాక్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వీరాంజనేయులు

జగ్గయ్యపేట అర్బన్:వైఎస్సార్ సీపీ చేనేత విభాగం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా దేవరశెట్టి వీరాంజనేయులు నియమితులైనారు. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒక ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి కృషి చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావుకు, మాజీ సర్పంచ్ గుర్రం నరసింహారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీకి క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, పార్టీ తనకు అప్పజెప్పిన ప్రతి పనిని బాధ్యతాయుతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెనుగంచిప్రోలు:పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం ప్రభుత్వ సూచనల మేరకు పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సుమారు 300 వివిధ రకాల పుష్పాలు, ఫలాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటటంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. ముందుగా ఆలయంలో గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణపతి హోమం పూర్ణాహుతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్, ఈఈ రమ, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పాలాది వెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, ధూళిపాళ్ల లక్ష్మణరావు, మండల, గ్రామ టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, కొత్తపల్లి సతీష్, నాయకులు చుంచు రమేష్, గజ్జి కృష్ణమూర్తి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్, ఈఓ కిషోర్‌కుమార్

షేర్‌మహ్మద్‌పేటలో పొలంబడి



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట):రైతులు సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు అవలంబించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ తెలిపారు. గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో సమగ్ర పంట యాజమాన్య పద్ధతులు రైతులు పాటించాలని సూచించారు. ముఖ్యంగా జీవన ఎరువులు వాడటంతో ఖర్చు తగ్గించుకోవటంతో పాటు భూసారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. నానో యూరియా, డీఏపీ ఎరువులను డ్రోన్‌ల ద్వారా పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

పోచంపల్లి(జగ్గయ్యపేట):గ్రామంలో సస్పెండైన ఫీల్డ్ అసిస్టెంట్‌పై గురువారం ఏపీడీ పార్థసారథి గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బంకా అంబేద్కర్‌పై పలువురు ఫిర్యాదు చేయటంతో ఈ ఏడాది జూలై 30న సస్పెండ్ చేయటంతో పాటు విధుల నుంచి తొలగించామని చెప్పారు. దీంతో అంబేద్కర్ తన సస్పెండ్‌కు కారణాలు తెలపాలని కలెక్టర్‌కు అప్పీలు చేశాడని తెలిపారు. దీంతో ఏపీడీ కూలీలు రాకుండానే మస్టర్‌లు వేశారనే ఫిర్యాదులపై గ్రామంలో విచారణ చేసి రికార్డు నమోదు చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ఆధిపత్య పోరులో భాగంగానే ఫీల్డ్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసినట్లు గ్రామస్తులు అంటున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించే యత్నం చేస్తుండటంతో గ్రామ మాజీ సర్పంచ్ మాత్రం అతను ఉండాల్సిందేనని పట్టుబట్టడంతో ఏం చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎంపీడీవో నితిన్, ఏపీవో రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

